
# కవిరాజు



కవి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు; మూలుగుతున్నాడు; మెలికలు తిరిగి పోతున్నాడు.

ఏమిటంటే, కవికి అజీర్తి చేసిం దన్నారు.

ప్రఖ్యాతి జాస్తిగా తిని అజీర్తి తెచ్చుకున్నాడు కవి.

ప్రఖ్యాతి అమితంగా తినరా దని కవికి వాళ్ళమ్మ చెప్పలేదు: గబగబా మెక్కరా దని కూడా కవికి వాళ్ళమ్మ చెప్పలేదు.

వాళ్ళమ్మ చెప్పలేదు కనక, కవికి ప్రఖ్యాతి దొరికే చోటికల్లా వెళ్ళి రెండు చేతులా అందిపుచ్చుకొని మరీ తిన్నాడు.

మర్యాదగా పిలిచి పీటవేసి కూర్చొబెట్టితే తప్ప ప్రఖ్యాతి తినటానికి వెళ్ళరాదని కవికి వాళ్ళమ్మ చెప్పలేదు. వాళ్ళెంత పెడితే అంతే తినాలిగాని అడిగి పెట్టించుకోవటం మర్యాద కాదనికూడా కవికి వాళ్ళమ్మ చెప్పలేదు.

అందుచేత కవి అత్యాచారంగా ప్రతి ఇంటోనూ జొరబడి బలవంతాన అడిగి ప్రఖ్యాతి పెట్టించుకున్నాడు.

కొందరు నిర్మొహమోటంగా, "మా ఇంటో ప్రఖ్యాతి లేదు, పో!" అని కవిని కసిరికొట్టారు.

మరికొందరు, "ప్రఖ్యాతిని మేము అడ్డమైనవాళ్ళకూ పెట్టం," అన్నారు.

"నువ్వు మా కేం పెట్టావని నీకు మేం ప్రఖ్యాతి పెడతాం?" అన్నారు ఇంకా కొందరు.

"మీకేం కావాలంటే అది ఇస్తాను. నాకు మాత్రం ఇంత ప్రఖ్యాతి పెట్టండి!" అన్నాడు కవి.

"మాకు లంచం పెడతావా, దుర్మార్గుడా?" అన్నారు వాళ్ళు. అంతేకాక వాళ్ళు లోకం గారి ఇంటికిపోయి తలుపు తట్టి, "విన్నావా, లోకం? కవి మమ్మల్ని ప్రఖ్యాతి పెట్టమని అడిగాడు. మేం పెట్టం అంటే లంచం ఇవ్వొచ్చాడు!" అని చెప్పి వచ్చారు.

"చాలా చెడ్డ కవి" అని లోకం పెదిమ విరిచి మళ్ళీ తలుపేసుకుంది.

* * *

"నువు ప్రఖ్యాతి జాస్తిగా తిని అజీర్తి తెచ్చుకున్నావు!" అన్నారు కవితో కవిమిత్రులు.

"నా కజీర్తా? నా కా అజీర్తి!" అన్నాడు కవి తోకతొక్కిన తాచల్లే లేస్తూ.

"నేను కడుపునిండా ప్రఖ్యాతి తిననే లేదు" అన్నాడు కవి.

"నే నింకా చాలా ప్రఖ్యాతి తిని హరాయించుకోగలను!" అన్నాడు కవి.

"నన్నసలు సగౌరవంగా పిలిచి తృప్తిగా ప్రఖ్యాతిపెట్టిన వెధవ ఎవడు?" అన్నాడు కవి.

(అట్లా అనరా దని కవికి వాళ్ళమ్మ చెప్పలేదు.)

"మరి నువ్వెందుకు మూలుగుతున్నావు - నీకు అజీర్తి చెయ్యకపోతే?" అన్నారు కవిమిత్రులు.

"ఎందుకట్లా మెలికలు తిరిగి పోతున్నావు?" అన్నారు కవిమిత్రులు.

"నేను మూలగటంలేదు, సంగీతం పాడుతున్నాను. మెలికలు తిరగటంలేదు, నృత్యం చేస్తున్నాను. కళలో కొత్తదనం మీరు తెలుసుకోలేరు. మీరు నన్నర్థం చేసుకోలేరు. మీరు నా స్నేహితులు కారు?" అన్నాడు కవి.

"మేము నీ స్నేహితులమే; నువ్వే మా స్నేహితుడివి కావు?" అని కవిమిత్రులు వెళ్ళిపోయినారు.

* * *

ఒక సీసాలో విమర్శ పోసి కవి దగ్గిరికి తెచ్చాడు విమర్శక వైద్యుడు.

"చూడటాని కంత అసహ్యంగా ఉంది. అదేమిటి?" అన్నాడు కవి.

"ఇది విమర్శ. దీన్ని తాగితే నీ అజీర్తి నెమ్మదిస్తుంది" అన్నాడు వైద్యుడు.

"నా కజీర్తి లేదు" అన్నాడు కవి.

కొడవటిగంటి కుటుంబరావు

"నేను వైద్యుణ్ణి. నన్ను మోసపుచ్చలేవు!" అన్నాడు విమర్శకుడు.

"మందు తీసుకునే అజీర్తి ఉంటుంది; మందు అవసరంలేని అజీర్తి ఉంటుంది. నాది మందు అవసరంలేని అజీర్తి. నీకీ సూక్ష్మాలు తెలియవు. నువు కవివి కావు!" అన్నాడు కవి.

"ఏ అజీర్తి అయినా లేకుండా ఉండటం మంచిది. నువ్వు కవివైతే అయినావు, వైద్యంకూడా తెలిసినట్టు నటించకు! నా మాట విని ఈ మందు కాస్త పుచ్చుకో?" అన్నాడు వైద్యుడు.

కవి సీసా పుచ్చుకుని బిరడా తీసి వాసన చూశాడు. కవి తల గిర్రున తిరిగిపోయింది. వాంతి అయినంత పని జరిగింది.

"ఛీ, ఛీ! నాకీ మందు వద్దు!" అన్నాడు కవి.

"వద్దకపోతే మానుతుందా ఏమిటి? బలవంతానైనా ఇస్తాను. నన్నెట్లా ఆపగలవో చూస్తాను!" అన్నాడు వైద్యుడు.

మందు నోట్లో పడగానే కవికి పెద్దవాంతి అయింది. గిలగిలా తన్నుకున్నాడు కవి. అరిచాడు కవి. చిందులు తొక్కాడు కవి. విమర్శకుణ్ణి అడ్డమైన తిట్లూ తిట్టాడు కవి.

కాని కవి కడుపు తాత్కాలికంగా ఖాళీ అయింది.

అట్లా కడుపు ఖాళీ కావటం ఆరోగ్యంగా తోచలేదు కవికి.

మళ్ళీ దేశమంతా తిరిగి ప్రఖ్యాతి తినటం మొదలుపెట్టాడు కవి. మళ్ళీ కవి పొట్ట పూటయింది. అట్లా ఉంటేనే బాగుందనుకున్నాడు కవి.

విమర్శ సీసాలు ఏ దుకాణంలో కనిపించినా హడలెత్తటం మొదలుపెట్టింది కవికి.

"ఆ సీసాలు నీకు కాదు. మరొకళ్ళకి!" అన్నప్పుడు కూడా ఆరాటం తగ్గలేదు కవికి.

"పాపం అవి వాళ్ళకివ్వకండి. కవుల అజీర్తికి మందివ్వటం ధర్మంకాదు. అది కవితా కళకు అత్యాచారం!" అన్నాడు కవి.

* * *

వైద్యులింకా తన వెంట పడుతూనే ఉండటం చూసి "నేనుకూడా వైద్యుణ్ణే!" అన్నాడు కవి.

తనకు వైద్యం తెలుసునని నిరూపించటానికి ఉపన్యాసాలివ్వసాగాడు కవి.

కవి కూడా వైద్యుడేనన్నారు! కవిత్వమూ, విమర్శా, రెండూ తెలియని వాళ్ళు.

కవి ఖ్యాతి జాస్తి అయింది. కవిరాట్టయినాడు.

కవిత్వమూ విమర్శా తెలియని వాళ్ళు కవిని కవిరాట్టు చేశారు.

కవి తన మందు సీసాలు చూపి, "నా మందు చూడండి, ఎంత నేత్ర పర్వంగా ఉందో! దీని వాసన చూడండి. ఇందులో సువాసన ద్రవ్యాలు కలిపాను. దీని రుచికూడా చాలా లేహ్యంగా ఉంటుంది...ఇది బాధ పెట్టకుండానే బాధ నివారణ చేస్తుంది!" అన్నాడు.

చిన్నచిన్న కవికుమారులూ, పిల్లకవులూ కవిరాట్టును చుట్టుముట్టి, "మాకు మీ మందు కావాలి?" అని ప్రాధేయపడ్డారు.

అడగనివాడిది పాపంగా. కవిరాట్టు పిల్లకవులందరికీ మందిచ్చాడు.

మందు తాగినవారంతా తమ అజీర్తి పోయిందనుకున్నారు. కాని మందు మూలంగా చాలమందికి అజీర్తి పుట్టుకొచ్చింది.

"మేమంతా పిల్లకవులం కామిప్పుడు. కవులమే!" అన్నారు వారు.

తాము కవులని చూపటానికి కవిరాట్టుగారి ప్రిస్క్రిప్షను కాగితాలు చూపారు.

ఆ కాగితాలమీద ఉన్న మందు పిల్లకవులకని లేదు. కవులకిచ్చేదనే ఉంది.

